వైఎస్ఆర్

నేటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్ లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ ఈనెల 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబెసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు యోగా చేయిస్తామని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటలకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు గంట వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని తెలిపారు. 9848861206, 7013238986లో సంప్రదించాలని కోరారు.

హక్కుల సాధన కోసం

కదం తొక్కిన కార్మికులు

- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్,ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి
- ఎంటిఎస్, కనీస వేతనం ఇవ్వాలి
- అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి
- మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల డిమాండ్

ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు, సిఐటియు నాయకులు

మీడియాతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప

సిఐటియు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ సిబ్బంది తమ హక్కుల కోసం కదం తొక్కారు. జిల్లాలోని ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట, కడప నగరంలో ధర్నాలు నిర్వహించారు. తమను రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్ అమలు చేయాలని, కనీసవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్, డైలీవేజ్ పరిధిలో దాదాపు 20వేల మంది పని చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, రెవెన్యూ, ఆర్‌బికె, రిమ్స్, విద్య, వైద్యారోగ్యం, ఎస్‌ఎస్‌ఎ, యూనివర్సిటీ, ఎపిఎస్‌ఎస్, ఎపిసిఎస్‌ఎఫ్, స్కీమ్ వర్కర్లు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామ పంచాయతీ, రెవెన్యూ సెక్యూరిటీ, డిఇఒ డెటా ఎంట్రి ఆపరేటర్స్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ట్రిపుల్ ఐటి, స్టాఫ్ నర్సులు, 2వ ఎఎన్ఎం, పారామెడికల్, హౌసింగ్, వెలుగు, ఉపాధి, ఆర్‌టిసి ప్రభుత్వ రంగ, స్థానిక సంస్థలు, ఐఎంఎల్, ధార్మిక సంస్థలు, మెడికల్ రెప్స్, స్వచ్ఛ భారత్, ఇలా అన్ని రకాల ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని చెప్పారు. ఉద్యోగుల రిటైర్డ్ మెంట్ వయసు పెంచాలని కోరారు. రిటైర్మెంట్ సౌకర్యాలు, ఆరోగ్య బీమా అమలు చేయాలని తెలిపారు. కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం, ఎస్‌ఎస్‌ఎ అన్ని ప్రభుత్వ పథకాలలో ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పులివెందుల ప్రాజెక్టు, సింహాద్రిపురం మండలం హిమకుంట్ల సెంటర్ టీచర్‌ను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 13 ప్రాజెక్టుల్లో పరిస్థితి దారుణంగా ఉన్నాయని తెలిపారు. రక్షణ, భద్రత కల్పించాలని కోరారు. 42 రోజుల వేసవి వేతనాలు ఇవ్వాలని కోరారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా, నగర నాయకులు విజయభాస్కర్, సుంకర రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికుల నుంచి రూ.18వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ కటింగ్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని కోరారు. ఇంజ నీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని పేర్కొన్నారు. రిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎస్‌ఎస్‌ఎలో పని చేస్తున్న వారికి 22 రోజుల సమ్మె వేతనం ఇవ్వాలని చెప్పారు. స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచాలని తెలిపారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, నాయకులు బైరవప్రసాద్, విజయ కుమార్, పవన్, వినీల, అంజలి, సుబ్బయ్య, నరసయ్య, హరి, శ్రీనివాసులు, ఆనంద్, జ్యోతి, విజయ్, గోపి, రవి, శ్రీను, దస్తగిరయ్య, సలీమ, సత్యం పాల్గొన్నారు.

బద్వేలు : స్థానిక సిఐటియు పట్టణ కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వరకు సిఐటియు బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను విడనాడి అసంఘటితరంగ కార్మికుల, కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తే స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు శివకుమార్ హరి, నాగేంద్రబాబు, హుస్సేనమ్మ, శోభదేవి విజయమ్మ ప్రవీణ్, రాయప్ప, రాజగోపాల్, సుబ్బరాయుడు,రామయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చిన్ని, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె మస్తాన్ షరీఫ్, ఎస్.కె ఆదిల్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య రంగం మరింత పటిష్టం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

ల్యాబ్‌లోని అత్యాధునిక పరికరాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఆరోగ్య రంగాన్ని, వైద్య విద్యను మరింత పటిష్టం చేసేందుకు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు. సోమవారం రిమ్స్ జిజిహెచ్ ప్రాంగణంలోని ప్రభుత్వ దంత వైద్యకళాశాలలో రూ.14 లక్షలతో నిర్మించిన మినీ ఆడిటోరియం, ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్ ప్రారంభించారు. ఇంకా సెంట్రల్ ల్యాబ్‌లో రూ. 2.లక్షలతో ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను, రిమ్స్ సూపర్ స్పెషాలిటీ బ్లాకులో రూ.6 కోట్లకు పైగా వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేసిన 'క్యాథ్ లాబ్ సెంటర్' ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీ రెడ్డి, జెసి అదితి సింగ్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం దంత వైద్యకళాశాల మినీ ఆడిటోరియంలో మంత్రి మాట్లాడుతూ ఏ ఒక్క నిరుపేద ప్రాణానికి వైద్యం కొరత రాకూడదన్న సహృద్భావంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య ఆరోగ్య రంగాన్ని, వైద్య విద్యను మరింత పటిష్టం చేస్తున్నాయన్నారు. గ్రామ స్థాయిలోనూ నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా స్థాయి ఆసుపత్రులకు అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, వైద్యసేవలను సక్రమంగా అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం, జిల్ ప్రజా ప్రతినిధుల సహకారం సత్ఫలితాలను అందిస్తోందనిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ వైద్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

హోలిస్టిక్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): పట్టణంలోని గాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిని మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో కలిసి ప్రారంభించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలున్న ప్రొద్దుటూరులో వైద్య సేవలు అందుబాటు ధరలో ఉండాలని యాజమాన్యానికి సూచించారు. బిపి, షుగర్, కార్డియాక్ సేవలకు శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ పేరెన్నిక కలిగిందని, క్యాథ ల్యాబ్ కలిగి వుండటం విశేషమన్నారు. కార్యక్రమంలో వంగల శశిభూషణ్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిటోనేటర్లు పేల్చి విఆర్ఎ హత్య

భార్యకు తీవ్ర గాయాలు
అదుపులో ఇద్దరు అనుమానితులు
వివిధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్

ప్రజాశక్తి - వేముల

డిటోనేటర్ పెట్టి పేల్చడంతో విఆర్ఒ మృతి చెందాడు. మండలంలోని వి.కొత్తపల్లిలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. నరసింహులు (45) విఆర్ఒగా పనిచేస్తున్నాడు. మృతుడు, అతని భార్య సుబ్బలక్షుమ్మ, ఇద్దరు కుమారులు, తన ఇంటిలోని కాంపౌండ్ లోపల ఆదివారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్‌ను మంచం మీద పైకి విసిరి పేల్చారు. పేలుడు ధాటికి నరసింహులు మంచంలో నుంచి గాలిలోకి ఎగిరి పైనున్న రేకులు తగిలి కిందపడ్డాడు. ఈ సంఘటనలో పక్కనే ఏపకప అతని భార్య సుబ్బలక్షుమ్మకు కూడా తీవ్ర గాయాలయ్యారు. కాగా తల్లి, కుమారులు తృటిలో తప్పించుకున్నారు. గాయపడ్డ వారిని కుటుంబ సభ్యులు హుటాహుటీగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నరసింహులు మృతిచెందాడు. సుబ్బలక్షుమ్మను మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి మురళి నాయక్, సిఐ నాగరాజు,ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో విచారించారు. సంఘటన స్థలం నుంచి డిటోనేటర్లను పేలుడుకు ఉపయోగించే ఒక పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయాన్నే సంఘటన స్థలానికి క్లూస్ టీం, బాంబు స్కాడ్‌లను పిలిపించి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తహశీల్దార్ ఇందిరా రాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేఖ సంఘటన స్థలాన్ని పరిశీలించి డిటోనేటర్ పేలుడు ఘటనపై విచారణ చేపట్టారు. విఆర్ఒ హత్యకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమే కారణమని భావిస్తూ పోలీసులు ఇద్దరి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. డిటోనేటర్ ఎక్కడి నుంచి తెచ్చారు, ఎవరి మైనింగ్ దగ్గర వాడుతున్నారు, అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మృతి చెందిన నరసింహులు

మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - కడప : పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, లీల వర్ధిని అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో స్వచ్ఛతా హీసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల బయట, కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న కలుపు మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వాలంటీర్లంతా కలిసి కళాశాలలో స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేసినందుకు ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ విద్యార్థులను అభి నందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్లు పి శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు లీల వర్ధిని పాల్గొన్నారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-కలసపాడు : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో ప్రతి విద్యార్థికీ అందమైన చేతిరాత అవసరమని ఆలిండియా హ్యాండ్ రైటింగ్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. మల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టేకూరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చక్కని చేతిరాతపై మెలకువలను తెలియజేశారు. శిక్షణ అనంతరం విద్యార్థులు పోటీలు నిర్వహించి వారి బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వెంకటరమణయ్య, రామచంద్రారెడ్డి, కరీముల్లా, గఫార్, ప్రసాద్ వె ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయిబాబా స్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని అక్కయపల్లెలో ఉన్న సాయిబాబా పాఠశాలలో సోమవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎం.వి. సాయిసుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ చేసుకుంటారని తెలిపారు విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి పెద్దల పట్ల గౌరవం మంచి లక్షణాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వి. శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు ముందస్తు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మంచి ప్రవర్తనతో సంకల్ప దీక్షతో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. విజయదశమి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన

ఉన్నత స్థానాలను అధిరోహించాలి : జెసి

ప్రజాశక్తి - కడప : ఇష్టంతో విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జెసి అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారి కార్యాలయంలో అమలు అవుతున్న పథకాలలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విద్యను అభ్యసిస్తున్న విభిన్న ప్రతిభా వంతులైన అంధులు, బధిరులు వారి విద్యని కొనసాగించడానికి వీలుగా ల్యాప్ టాప్‌లు, టచ్ ఫోన్‌లను జెసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగాలంటే ప్రతి ఒక్కరూ చక్కని ప్రణాళిక రూపొందించుకుని ఇష్టంతో చదువుకోవాలని అన్నారు. అప్పుడే మన కష్టానికి తగ్గ ఫలితం అందుతుందన్నారు. మిగిలిన వారి కంటే విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరని అన్నారు. అనంతరం 4 ల్యాప్ టాప్‌లు, 10 డైసీ ప్లేయర్, 12 టచ్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సందాలకులు ఆర్.వి. కృష్ణ కిశోర్, సమాచార శాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల పర్యవేక్షకులు అనిల్ , సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప : జిల్లా వ్యాప్తంగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖల్లో జరుగుతున్న అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్‌టిఐ చైర్మన్ కోటపాటి లక్షుమయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటపాటి లక్షుమయ్య మాట్లాడుతూ జిల్లా మొత్తం అవినీతితో, నిర్లక్ష్యంతో నిండిపోయి ఉందన్నారు. సదరు రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అఫీషియల్, అనఫీషియల్ ఉద్యోగుల వల్ల ప్రజలకు అన్యాయం జరుగు తోందని వాపోయారు. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యో గులు తమ ఇష్టం వచ్చినట్లు నిబంధనలు వ్యతిరేకంగా నడుచుకుం టున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్‌హెచ్, నకలు, ఇసి, సెర్చ్ సర్వీలు పొందేందుకు వసూలు చేసే ఫీజుల్లో సుమారు 30 శాతం అదనంగా వసూలు చేసి రశీదులు ఇవ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు రిజిస్ట్రార్ కార్యాల యాలను సందర్శించి అవి నీతిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్తార్, షక్ అమిర్‌బాష, మాజీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, మామిళ్ళ బాబు పాల్గొన్నారు.

వైద్య రంగంలో అత్యాధునిక పద్ధతులు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

ప్రపంచ స్థాయిలో వైద్య రంగంలో అత్యాధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని ప్రముఖ ఆర్థో, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సి. విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళశారం స్థానిక ఐఎంఎ హాల్‌లో నగరానికి చెందిన ప్రముఖ వైద్యులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్రోపాలిటన్ నగరాలకు ధీటుగా మన కడప నగరంలో నేడు సుశిక్షితులైన వైద్యులు అత్యాధునికమైన వైద్య విధానాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాసాగర్ ఆస్పత్రిలో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలలో అత్యాధునికమైన రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స విధానాన్ని మొదటిసారిగా కడపకు తీసుకొచ్చామని చెప్పారు.అనతి కాలంలోనే 300కు పైగా సర్జరీలను విజయవంతం చేశామని చెప్పారు. త్వరితగతిన నడవగలగడం ప్రత్యేకతలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ సూర్య రెడ్డి, డాక్టర్ బాల్ రెడ్డి, డాక్టర్ పల్లా భాస్కర్, డాక్టర్ నాగేంద్రప్రసాద్, డాక్టర్ జయ సోమేశ్వర్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ మురళీ మాధవ్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో కడప, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ వంటి బకాయిలను చెల్లించకుండా గత ప్రభుత్వం తీవ్రంగా వేధించిందన్నారు. 12వ పిఆర్‌సిని ఏర్పాటు చేసి, పే రివిజన్‌ను అమలు చేయాల్సి ఉండగా కమిటీ పేరుతో కాల యాపన చేయడం తగదన్నారు. గత పిఆర్‌సి, డిఎ బకాయిలను నేటికీ చెల్లించకపోవడం దుర్మార్గమని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో వల్ల ప్రభుత్వ విద్యా రంగం అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోగా జిపిఎస్ అనే పేరుతో మరో దుర్మార్గమైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారని విమర్శించారు. బోధనేతర కార్యక్రమాలలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేసే విధానాలను తక్షణం రద్దు చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఒ 56ను రద్దు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రం (ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్) చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిఆర్‌డిఎకు తరలిస్తూ తీసుకువచ్చిన జిఒ నంబర్ 56ను తక్షణ ఉపసంహరించుకోవాలి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో శిక్షణ నైపుణ్యత మార్కెటింగ్‌ను అభివృద్ధి చేసేందుకు ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు భాగంగా ఇదివరకే విశాఖలో, తర్వాత కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక కేంద్రంలో ఉత్తర బ్లాక్‌లో రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో, 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిం దన్నారు. ఈ సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాపై కక్ష సాధింపుతో సిఆర్‌డిఎకు తరలిస్తూ జిఒను తీసుకురావడం దుర్మార్గమన్నారు. తరలింపును ఆపకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఏడీని నియమించండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప అగ్రికల్చర్ డివిజన్‌లో ఆరు మండలాలు ఉన్నాయని, పర్యవేక్షణ చేయాల్సిన ఏడీ ఆరు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశారని, అప్పట్నుంచి ఇప్పటివరకు మరొకరిని నియమించలేదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి తెలిపారు. సోమవారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ కడప అగ్రికల్చర్ డివిజన్ పరిధిలో ఏడీ లేకపోవడంతో ఎరువులు, మందులు, విత్తనాల ధరలో ఇష్టారాజ్యంగా డీలర్లు అమ్ముతున్నారని తెలిపారు. రైతులకు, మండల వ్యవసాయ శాఖ, ఆర్‌బికె అధికారులకు సలహాలు, సూచనలు అగ్రికల్చర్ ఏడీ ఇచ్చేవారని పేర్కొన్నారు. ఆరు నెలలుగా ఇవి అటకెక్కాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా రాజారత్నం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వి.రాజా రత్నం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ప్రేమ్ దాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆది, చిన్నయ్య పాల్గొన్నారు

ఎక్సైజ్ అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

త్వరలో నూతన మద్యం పాలసీ అమలు : కలెక్టర్

ప్రజాశక్తి -కడప

త్వరలో నూతన మద్యం పాలసీ అమలులోకి వస్తుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ప్రభుత్వం మద్యం నోటిఫికేషన్ త్వరలో విడుదల చేయనున్న నేపథ్యంలో దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కట్టుదిట్టంగా, భద్రతా చర్యలు పాటిస్తూ, పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వక అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు ఛాంబర్‌లో మద్యం దుకాణాల పాలసీపై కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించడానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వబోతుందని చెప్పారు. ఇందులో భాగంగా కడప జిల్లాలో 139 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించబోతున్నామన్నారు. దరఖాస్తు చేయు వ్యక్తులు సదరు మద్యం దుకాణాలకు సంబంధించిన ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేసుకోవచ్చునని అన్నారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్, అసిస్టెంట్ డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వినోద్ కుమార్ నాయక్, కడప ఎక్సైజ్ సిఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

చందనాఖాన్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడప జిల్లా కలెక్టర్‌గా సేవలు అందించిన చందన ఖాన్ మృతి కళారంగానికి తీరని లోటని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పేర్కొన్నారు. సోమవారం యోగి వేమన యూనివర్శిటీ లలిత కళా విభాగం నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనా ఖాన్ టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి గా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శిగా పనిచేసిన సమయం లో యోగి వేమన విద్యాలయ లో లలిత కళా విభాగాన్ని ఎంతో ప్రోత్సాహించారని పేర్కొన్నారు. రెండు సార్లు హరిత హోటల్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆమె సూచనలతో నిర్వహించామని చెప్పారు. శిల్పారామం అభివృద్ధి కమిటీలో లలిత కళా విభాగం అవసరం గుర్తించి లలిత కళా విభాగం ఆధ్వర్యంలో పలువర్క్ షాప్‌లు నిర్వహించాలన్నారు. ఆమె స్వతహాగా చిత్రకారిణి కావడం వల్ల కళలకు ప్రోత్సాహాన్ని ఇచ్చారని చెప్పారు. ఇటీవలే ఆమె తన పెయింటింగ్‌లలో కొన్నింటిని యూనివర్సిటీకి ఇవ్వాలని అనుకున్నారని, ఇంతలోనే మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సి.హెచ్. వెంకటేష్ , చినరాయుడు, బి. ఇరప్ప, చంటి సూరి, ఎం. వాసవి , డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, సుధాకర్ పాల్గొనిసంతాపం వ్యక్తం చేశారు.

'రూట' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్. జాకిర్ హుసేన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముల్ల జుబేర్ అహ్మద్, జిల్లా కోశాధికారిగా ఎం. కరామతుల్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా హబీబుల్లా, ఖాదర్ బాషా, మునీం సాహెబ్,వైస్ ప్రెసిడెంట్‌లుగా అలి అక్బర్, ముజీబ్, అస్లం ఆదనపు ప్రధాన కార్యదర్శులుగా ముహమ్మద్ దావూద్, జిలానీ బాషా, ఫైరోజ్ బాషా, కార్యదర్శులుగా వలియ్యుల్ ఖయ్యూం, ముహమ్మద్ అలీ,అబ్దుల్ బాసిత్ ను ఎన్నుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా రూట రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ సిరాజుద్దిన్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ బాషా వ్యవహరించారు.

మురుగు నీటిని పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వార్డుల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో సోమవారం కమిషనర్ రాముడుతో కలసి ఆయన వార్డుల్లో పర్యటించారు. చందమామ డాబా వద్ద ఉన్న భూగర్భ డ్రయినేజీ సమస్యతోపాటు షాదీఖానా వద్ద రోడ్డు రాకపోకల ఇబ్బంది, న్యాక్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న రజక కాలనీలో ధోబి ఘాటు మురికినీరు, ఇతర సమస్యలను స్థానికులు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ దృష్టికి తెచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీ ఏర్పాటుకు అనుమతివ్వాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఏర్పాటుకు అనుమతినివ్వాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని టిడిపి నేతలు కోరారు. సోమవారం వెలగపూడిలోని సెక్రటేరియట్ కార్యాలయంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని వేంపల్లెకు చెందిన టిడిపి నాయకులు పివి రమణ, నల్లగారి కృష్ణారెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు కలిశారు. శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ వచ్చి చాలా రోజులైందని, ఆ మేరకు దరఖాస్తులు కూడా పంపామన్నారు. వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. త్వరగా కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన మంత్రి కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. అనంతరం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను కలిసి కమిటీ ఏర్పాటుపై వినతి పత్రం అందజేశారు.

ఆర్‌టిడి కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థులు గాంధీజీ ఆశయ సాధనమైన స్వచ్ఛభారతపై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరుణేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బారాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చాపాడు : స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సోమవారం స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వివిధ నినాదాలు చేస్తూ ప్రజలందరికీ అవగాహన కల్పించారు. ర్యాలీలో భాగంగా చిన్నారులు చేసిన స్వచ్ఛభారత్ నృత్యం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్రకుమార్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ సూచించిన స్వచ్ఛభారత్‌ను రాబోయే తరాల వారు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సిబిఐటి డైరెక్టర్ డాక్టర జి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీనీ రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండలంలోని చీనీ తోటలను సోమవారం కెవికె సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎం.బాలకృష్ణ పరిశీలించారు. ముఖ్యంగా వేరుకుళ్లు తెగులు, మంగు, పోలుసుల తెగుళ్లను గుర్తించి వాటి నివారణ మార్గాలను రైతులకు సూచించారు. వేరుకుళ్లు నివారణకు ట్రికోడర్మా జీవ శిలీంద్రాన్ని పశువుల పేడతో కలిపి బెల్లపు నీటితో మిశ్రమాన్ని తడుపుతూ పదిరోజుల నిల్వ ఉంచి చెట్టు మొదల్లో నుంచి కొంచెం దూరంలో వేసుకోవాలన్నారు. మంగు, పోలుసు తెగుళ్ల నివారణకు వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఈశ్వర ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి యర్రంరెడ్డి ఈశ్వర ప్రసాద్ రెడ్డిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలను మరచిపోకుండా స్కూల్‌కు ఏదైనా చేయాలనే తపనతో 1991-92 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,116 అందజేశారన్నారు. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి పాఠశాలకు దాదాపు రూ.2.50 లక్షతో 50 చదరాలు కాంక్రీట్‌తో ఫ్లోరింగ్ వేయించడం ఎంతో అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థి ఈశ్వర ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో ఎస్ఎస్‌సిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉడతా భక్తిగా తన వంతు సాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయన సహచర విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాజుల గురువాయపల్లె గ్రామ కూటమి నాయకులు చింతా శివరామిరెడ్డి, రాజుల శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కె.తిమ్మాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం గ్రామ నాయకులు శివరామిరెడ్డి, శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి (చిరు సంచులు) మినికిట్స్ పథకం కింద ఎన్‌డిఎస్‌హెచ్1012 రకం పొద్దుతిరుగుడు విత్తనాలు ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భీంచెర్ల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యాచారం చేయబోయిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -చక్రాయపేట

మండలంలోని నెరుసుపల్లె పంచాయతీ అప్పిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై బలాత్కారం చేయబోయిన శివాజీ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటివి పునరావృతం కాకుండా గ్రామ సచివాలయాల్లో మహిళా పోలీసులకు, పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, అంగన్వాడీ కేంద్రాల్లో వర్కర్లకు విద్యార్థులకు సూచనలివ్వాలని చెప్పినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగారావు, పోలీసులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పిబిసి మరమ్మతులకు మోక్షం

జంబు, పిచ్చిమొక్కలతో పూడుకపోయిన కాలువ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని ప్రధాన సాగునీటి వనరులైన పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పిబిసి) కాలువ మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని తొండూరు డిస్ట్రిబ్యూటరీ కాలువలో గడ్డి, ఇతర పిచ్చిమొక్కల కారణంగా నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగేది. అలాగే గురజాల సమీపంలోని ప్రధాన కాలువను ఆనుకొని బ్రిడ్జి మరమ్మతుల కారణంగా నీరు వృథాగా పోయేవి. కొన్నేళ్లుగా సమస్య క్షేత్ర స్థాయిలోని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన ఫలితం లభించలేదు. దీంతో నీరు పూర్తిస్థాయి ఆయికట్టుకు పోవాలంటే కష్టంగా ఉండేది. తొండూరు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని 15 కిలోమీటర్ల మేర జంబు, ఇతర పిచ్చి మొక్కలు, రాళ్లతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండేది. గడ్డి మొక్కలు తొలగింపు, మరమ్మతులకు టెండర్లను ఆహ్వానించారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం..

పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని తొండూరు డిస్ట్రిబ్యూటరీ కాలువలో మరమతు పనులకు టెండర్లను పిలిచాం. టెండరు ప్రక్రియ పూర్తవుతుంది. త్వరలోనే సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభిస్తాం.

- రాజశేఖర్, ఇఇ, పులివెందుల బ్రాంచ్ కెనాల్

పంచ్ కొడితే పతకాలే

తేక్వాండోలో చిరుతలు - ప్రతిభ చాటుతున్న చిన్నారులు

శిక్షణ పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - కడప అర్బన్

వారు పంచ్ కొడితే పతకాలు పట్టాల్సిందే. తేక్వాండో క్రీడలో ప్రతిభ చాటుతూ పతకాలను కైవసం చేసుకుంటున్నారు. అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ తేక్వాండో క్రీడలో దూసుకెళ్తున్నారు. నగరంలోని కెఆర్‌ఆర్ఎం స్కూల్ క్రీడా మైదనంలో చిన్నారులకు తేక్వాండో కోచ్ వెంకటేష్ శిక్షణలో వారు చిచ్చర పిడుగుల్లా తయారై ప్రత్యర్థిని చిత్తు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవ్వడంతో చిన్నారులు అనతి కాలంలోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాగా రాణిస్తున్నారు. వివిధ పోటీలలో ఇప్పటికే అనేక పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో పాల్గొని కడపకు బంగారు పతకం తేవానికి క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలను స్కూల్ యాజమాన్యం కల్పిస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో చిన్నారులు రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. వీరిని మరింత ప్రోత్సహించి శిక్షణ ఇస్తే జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిస్తారు. చిన్నారుల మనోభావాలు వారి అభిప్రాయాల్లో..

అమ్మాయిలకు కరాటే అవసరం

నేటితరం అమ్మాయిలు కరాటే, కర్రసాము వంటి క్రీడల్లో శిక్షణ తీసుకోవడం అవసరం. నా తండ్రి తైక్వాండోలో కోచ్ వెంకటేష్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. అన్ని రకాల మెలకువలు నేర్చుకుంటున్నాను. పోటీల్లో విజేతగా నిలుస్తాను.

- టి.పవిష్ణ, కడప.

చదువుతో పాటు క్రీడలు

జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలన్నది లక్ష్యం. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నా తండ్రి కోరిక. అందుకే తేక్వాండోలో శిక్షణ తీసుకు ంటున్నాను .క్రీడల వల్ల ఆరోగ్యం, శారీరక దృఢత్వం సాధించవచ్చు.

- జి.తుశాంత్, కడప.

కరాటే అంటే ఇష్టం

చిన్నప్పటి నుంచే కరాటే అంటే ఎంతో ఇష్టం. యుద్ధ విద్యలు చాలా అవసరం. మిలటరీ, పోలీసు రంగంలో పని చేయాలంటే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తీసుకోవాలి. దేశానికి సేవ చేయాలన్నదే నా తండ్రి ఆశయం. ఆ దిశగా కృషి చేస్తున్నాను.

- షేక్.నవాజ్ ఉర్ రెహమాన్, కడప.

బంగారు పతకాలు సాధించాను

గత ఏడాది వేసవి సెలవుల్లో కెఆర్‌ఆర్ఎం స్కూల్‌లో కోచ్ వెంకటేష్ వద్ద తేక్వాండోలో తీసుకున్నాను. కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో, తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకాలు సాధించాను. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తాను.

- వేము.సుహృత్.కడప.

చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ

కెఆర్‌ఆర్ఎం స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తున్నాం. కోచ్ వెంకటేష్ మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులుకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించడం గర్వంగా ఉంది.

- ఇంతియాజ్ రెహమాన్, కెఆర్‌ఆర్ఎం కరస్పాండెంట్, కడప.

20 ఏళ్ల నుంచి శిక్షణ ఇస్తున్నాం

జిల్లాలోని చిన్నారులకు తేక్వాండో, కరా టే, కర్రసాము, కుస్తీ వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాను. ప్రస్తుతం కెఆర్‌ఆర్ఎం స్కూల్ క్రీడా మైదానంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాను. అనేక మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. కోచింగ్ కొనసాగిస్తూనే ఉన్నాను.

- కొన్నిపాటి వెంకటేష్, కోచ్. కడప.

నామమాత్రపు సమావేశాలెందుకు..?

- కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజా సమస్యలను తాము కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినప్పుడు అవి పరిష్కారం కావడం లేదని అలాంటప్పుడు ఈ నామమాత్రపు సమావేశాలెందుకు నిర్వహించాలని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిదేవి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ఇర్ఫాన్, జీలాన్, సుబ్బారెడ్డి, మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల పనితీరు పట్ల తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పట్టణంలో గాంధీరోడ్డు, మైదుకూరు రోడ్డు తర్వాత అంత రద్దీగా ఉంటున్న 2టౌన్ బైపాస్ రోడ్డులో లైట్లు వెలగడం లేదని, రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అక్కడి పార్కులో మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదన్నారు. ఈ రోడ్డు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. శ్రీనివాస నగర్‌లో బ్రాందిషాపు సమస్య ఉందన్నారు. పట్టణమంతా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పట్టణంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. ఈనెల 3నుంచి దసరా ఉత్సవాలు మొదలవుతున్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్ వేలం పాట మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు చెప్పిన సమస్యల పట్ల అధికారుల స్పందన కరువైన పక్షంలో ధర్నాలకు దిగడం, ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. మున్సిపల్ మరో వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా మాట్లాడుతూ అడిగిన సమస్యలే పరిష్కారం కానప్పుడు కొత్త సమస్యల పరిష్కారం కోసం అడిగేందుకు మనస్కరించడం లేదన్నారు. కూరగాయల మార్కెట్ సమస్య ఏమైందన్నది అర్థం కావడం లేదన్నారు. పట్టణంలోని అన్ని చికెన్ సెంటర్ల నుండి వ్యర్థాల సేకరణ అంశాన్ని ఓ మహిళా ఉద్యోగిని ఔట్‌సోర్సింగ్ ద్వారా పబ్లిక్‌హెల్త్ వర్కర్‌గా ఆప్కోస్‌లో తిరిగి నియమించే అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి

ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

అక్రమ కట్టడాలపై కలెక్టర్‌కు సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు చెన్నమ రాజు పల్లె పంచాయతీలోని పృథ్వీ కన్‌స్ట్రక్షన్ వంకలు బ్లాక్ చేసి కాంపౌండ్ వాల్ కట్టడంపై సోమవారం కలెక్టర్‌కు సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరులో పృథ్వీ కన్‌స్ట్ర క్షన్ వెంచర్ ప్రొద్దుటూరు-దువ్వూరు మెయిన్ రోడ్డు పక్కన వేస్తున్నారని, వరదలు వస్తే మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంచర్ చెన్నంరాజుపల్లె దాటిన తర్వాత దువ్వూరు మెయిన్ రోడ్డు పక్కన వంకలకు అడ్డుగా ప్రహరీ నిర్మించి ప్లాట్లు వేశారని, ఆ ప్లాట్లను అమాయక ప్రజలకు కట్టబెడుతున్నారన్నారు. వరదలు వస్తే అక్కడ కట్టుకున్న ఇల్లు అన్ని పక్కన ఉన్న దువ్వూరు మెయిన్ రోడ్డు మునిగిపోతుందని వివరించారు. ఈ ప్లాట్‌లకు పర్మిషన్ ఏ రకంగా ఇచ్చారో అధికారులు పరిశీలించాలని సూచించారు. పృథ్వీ వెంచర్లకు సంబంధించిన ప్లాట్‌లన్ని ఎక్కడ చూసినా వంక పక్కన వేస్తున్నారు. ఆ భూముల వెంచర్లలో వంక పోరంబోకు భూములను కలుపుకునే అవకాశం ఉందన్నారు. అధికారులు అక్రమ వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల అద్భుత ప్రతిభ

వేంపల్లె :మండలంలోని రామిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో అద్భుత ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగాంజనేయులు తెలిపారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో రామిరెడ్డిపల్లె పాఠశాల విద్యార్థులు ఆర్.జస్వంత్ కుమార్‌రెడ్డి ఒకటో ర్యాంకు, జిల్లాలో 13వ డివిజన్ పరిధిలో ఎనిమిదవ ర్యాంకు, ఆర్ యోగమృత ఐదవ ర్యాంకు, కె.హిమవర్ధనరెడ్డి మంచి ప్రతిభ కనబరచి ర్యాంకులను సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన బి.ఓబుల్‌రెడ్డి విహారయాత్రకుగానూ ఒక్కొక్క విద్యార్థికి రూ.1000 చొప్పున బహుమతి ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం మాజీ సర్పంచ్ శ్రీరామిరెడ్డి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రొద్దుటూరులోని జార్జ్ క్లబ్‌లో నిర్వహించిన క్రీడల్లో అయ్యవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కన బరిచినట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తెలిపారు. జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలో బి.కిరణ్, మునాఫ్, నాగచరణ్, మనస్విని ప్రతిభ కన బరిచారు. వీరు నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరరావు, రమేష్ బాబు, రామన్న, అరిగెల భాస్కర్ అభినందనలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు వివి శివారెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యాటక పురస్కార గ్రహీతకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

2023-24 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ప్రకటించే ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్ బహుమతి ప్రదాత బాలకొండ గంగాధర్‌ను తోటి అధ్యాపకులు స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పొందుతున్న పర్యాటక రంగంపై విశిష్ట రచనలు చేసి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు పొందిన గంగాధర్ తమ కళాశాలలో ఉండడం అదృష్టమని ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. గతంలో కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో పర్యాటక కోర్సును ప్రారంభించి వందలాది విద్యార్థులను ఆ రంగంలో నిపుణులుగా తయారు చేశారన్నారు. పర్యాటక రంగ ప్రాముఖ్యతను వివరిస్తూ అనేక వ్యాసాలు రాశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, మాధవరావు, డాక్టర్ నాగలక్ష్మిదేవి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రామకృష్ణ, అరవింద్, షఫీవుద్దీన్, డాక్టర్ మల్లేశ్వరమ్మ, రాజారెడ్డి, జనార్ధన్, తేజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

బాలకొండ గంగాధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్

మంత్రిచే కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రూరల్ పరిధిలోని రాయల్ కౌంటి రిసార్ట్ ప్రాంగణంలో చేతన సంస్థ సౌజన్యంతో వికసిత ఫౌండేషన్ నేతృత్వంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. శిక్షణ పొందిన 20 మందికి మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేతన సంస్థ ఛైర్మన్ వెనిగళ్ల రవికుమార్ సేవలు మరువలేనివన్నారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ సంస్థ అందిస్తున్న సేవలతో సమాజంలోని అట్టడుగు వర్గాల వారు కొందరైనా ఉన్నత స్థితికి వస్తే తమకు అదే సంతోషమన్నారు. పూర్తి స్థాయిలో తాము అండదండలు అందించలేక పోయినా,, ఎవరిపాటికి వారు తమ కాళ్ల మీద నిలిచేలా సహకరిస్తామని ఇదే తమ ఛైర్మన్ రవికుమార్ ఆశయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఒంటేరు శ్రీనివాస్‌రెడ్డి, శివ రామిరెడ్డి, శూలం ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.28 వేలు వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శానిటేషన్ వర్కర్లకు వేతనం రూ.28 వేలు ఇవ్వాలని సోమవారం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు కార్యదర్శి రాఘవ సంయుక్తంగా మాట్లాడుతూ గవర్నమెంట్ హాస్పిటల్‌లో 20 ఏళ్లుగా పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు రూ.12,400 వేతనాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 549 జీవో ప్రకారం రూ.16,000 ఇవ్వాల్సి ఉండగా, అది కాంట్రాక్టర్ ఇవ్వడం లేదన్నారు. ఈమధ్య కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ నుంచి శానిటేషన్ వర్కర్లకు రూ.28 వేల వేతనాలు ఇవ్వాలని ప్రకటించిందన్నారు. దాన్ని వెంటనే అమలు చేయాలని మంత్రి సత్యకుమార్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్మికులకు వారి జీతాల్లో పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కట్టవుతున్నా, కాంట్రాక్టర్ ఇవ్వాల్సిన పర్సంటేజీ పిఎఫ్ జమ చేయడం లేదన్నారు. ప్రతి నెల జీతాలు ఇచ్చేలా అమలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి పకీరయ్య, కళావతి, దుర్గ, కార్మికులు పాల్గొన్నారు.

బీరం పాఠశాలను సందర్శించిన మంత్రి

ఖాజీపేట : మండల పరిధిలోని కొత్తనెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలను ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, సిబ్బందితో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను బోధిస్తుండడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ మంత్రి ఆయనను ఘనంగా సన్మానించారు. మంత్రిని పాఠశాల యాజమాన్యం కూడా ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్ పర్సన్ బీరం సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సక్షం అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్ పల్లె-1, చాపాడు-1, చియ్యపాడు-1,2 అంగన్వాడీలను అన్ని రకాల మౌలిక వసతులతో కూడిన సక్షం కేంద్రాలను ప్రారంభించామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ తెలిపారు. సోమవారం చియ్యపాడు అంగన్వాడీ కేంద్రంలో ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాల్లో ఎల్ఈడీ టివిలు, శుద్ధినీటి యంత్రం, వర్షం నీరు నిలువ చేసే తొట్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజులుగా వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీలు, డ్రాయింగ్, ఫ్యాషన్ షో, తల్లిదండ్రులతో సమావేశం వంటి కార్యక్రమాలు నిర్వ హించామని తెలిపారు. అనంతరం గుంతచియ్యపాడు గ్రామంలో పం చాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిసి పద్మ, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ స్వరూప, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు ఛాయా, సరస్వతి, నాగమణి, రోజమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వేముల : అంగనవాడీ కేంద్రాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. తాజాగా గొల్లల గూడూరు అంగన్‌వాడీ కేంద్రం పోషణ వాడుక కార్యక్రమం కింద ఎంపిక కావడంతో ఆ కేంద్రానికి ప్రభుత్వం నుంచి కొన్ని ప్రత్యేక వస్తువులు వచ్చాయి. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ హసీనా, ప్రభావతి, గొల్లలగూడురు టిడిపి నాయకుడు రవికుమార్‌రెడ్డి, హైస్కూల్ హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, అంగన్వాడీ టీచర్, ఆయాలు, పిల్లలు, తల్లులు, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆదిత్య బిర్లా ఫ్యాషన్ ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లి శారద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్సిళ్లు, పెన్నులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి శ్రావణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పరికరాలను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.నరసింహారెడ్డి, ఉపాధ్యాయుడు ఇ.రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఫ్యాకల్టీలకు జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జియూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఉద్యోగుల జీతాలను పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్‌హుసేన్ కోరారు. సోమవారం సిఐటియుసి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30ని డిమాండ్ దినోత్స వంగా ప్రక టించడంతో సిఐటియుసికి మద్దతుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ బయట కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఒకే దేశం-ఒకే ఎన్నిక అనేది తీసు కొచ్చారన్నారు. కానీ ఎపిలోని ఆర్జియూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు మాత్రం చాలీ చాలని జీతాలు ఇస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబాలు చాలా హీన స్థితిలో ఉన్నాయన్నారు. ఒకే పని-ఒకే జీతం, సమా న పనికి-సమాన వేతనం అనే జిఒ తెచ్చి జీతాలు ఇవ్వాలని కోరారు. శాశ్వత స్వభావం పనుల్లో ఆచార్యులకు బెసిక్ వేతనం ఇవ్వాలని కోరారు.

మహారాజశ్రీ గుత్తి సివిల్ జడ్జీ (సీనియర్ డివిజన్) గారి కోర్టు నందు, గుత్తి

O.S.NO:28/2024

Between:

ఎమ్.సందీప్ రెడ్డి ...వాది

ఎదిరి

డి.రమణా రెడ్డి ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

ప్రతివాది అనగా దుగ్గయ్య గారి రమణా రెడ్డి, S/o డి.నరసిహా రెడ్డి, వయస్సు సుమారు 44 సంవత్సరములు, వృత్తి వ్యాపారము, డోర్ నెం.4/349, మెయిన్ రోడ్డు, R.S.కొండాపురం గ్రామము & మండలము, వై.ఎస్.ఆర్.కడప జిల్లా, వారికి ఇందుమూలముగా తెలియ జేయడము ఏమనగా వాది అనబడు వారు మీరు వ్రాయించి ఇచ్చిన ప్రామిస్సరినోటు బాకీ రాబట్టుకొను నిమిత్తము మీపైన పై కనబరచిన కోర్టులో దావా దాఖలు చేసి యున్నారు. సదరి దావా సమన్లు మీరు తీసుకొనకుండా ఆలస్యము చేయుచున్నందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు మీకు దినపత్రిక మూలకముగా ఈ దావా సమన్లు జారి చేయటము జరిగినది. కావున మీరు 21-10-2024వ తేదిన ఉదయం 10:00 గంటలకు స్వయముగా కాని లేదా వకీలు ద్వారా కాని పై కోర్టు ఎదుట మీరు తప్పక హాజరై, మీరు మీ ఆక్షేపణలు తెలియచేసుకొనవలసి వున్నది. లేని యెడల మీ పరోక్షమునందు కోర్టు వారిచే దావా తీర్మానము చేయుటము జరుగును

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

Z.సతీష్, అడ్వకేట్,
గుత్తి, అనంతపురం జిల్లా